# ఆదిలాబాద్-మంచిర్యాల



# సూర్య

www.suryaaa.com

◆ నిర్మల్ ◆ కొమురంభీం ఆసిఫాబాద్

శుక్రవారం 17 జనవరి 2025 , పేజీలు 06


## మా పోలీసు సేవలు ఎలా ఉన్నాయ్? ఫీడ్ బాక్ ప్లీజ్

- ప్రతి ఠాణాలో అందుబాటులోకి క్యూఆర్ కోడ్
- క్యూఆర్ కోడ్ పై స్కాన్ చేసి మీ అభిప్రాయం చెప్పొచ్చు




**లక్షెట్టిపేట, జనవరి 16, సూర్య మేజర్ న్యూస్ :**
పోలీసు శాఖ తమ పనితీరును స్వయంగా తెలుసుకొని మెరుగుపరుచుకోవాలని అనుకుంటోంది. ప్రజల అభిప్రాయం తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్‌ని ప్రవేశ పెట్టింది. ఇది అన్ని పోలీస్ స్టేషన్లకు చేరింది. రామగుండం పోలీసు కమిషనరేట్‌లోని ప్రతి ఠాణా ఆవరణలో ఫిర్యాదుదారులకు కనిపించే విధంగా ఏర్పాటు చేశారు. వివిధ సమస్యలపై ఠాణాలో ఫిర్యాదు చేసిన తర్వాత వారికి అందుతున్న సేవలపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అందులో వచ్చే ఫారంపై వివరాలు తెలపాలి.ఇది నేరుగా హైదరాబాద్ డీజీ కార్యాలయానికి చేరుతుంది. ఎవరు సమాచారం ఇచ్చారు అనేది గొప్యంగా ఉంచి సంబంధిత స్టేషన్లకు తెలియజేయరు. (మిగితా2లో)

### ప్రభుత్వ పథకాల సర్వేను

## పకడ్బందీగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**

**ఆసిఫాబాద్ ప్రతినిధి 16 జనవరి సూర్య మేజర్ న్యూస్**



జనవరి 16 నుండి ప్రభుత్వ పథకాల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం ఆసిఫాబాద్ మండలంలోని అంకుసాపూర్ గ్రామంలో చేపడుతున్న రైతు భరోసా రేషన్ కార్డులు ఆత్మీయ భరోసా ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.

### లబ్ధిదారుల జాబితా పకడ్బందీగా

## క్షేత్రస్థాయి పరిశీలన జరగాలి

**జిల్లా పాలనాధికారి రాజర్షి షా**


2 లో

జిల్లా పాలనాధికారి ఆదిలాబాదు జిల్లాలోని సిరికొండ మండలం రాయ్ గూడ, కొండాపూర్ పొన్న గ్రామాలలో పర్యటించి సంబంధిత అధికారులు చేస్తున్న రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల సర్వే సూపర్ చెక్‌ల ఫీల్డ్ వెరిఫికేషన్‌ను దగ్గరుండి పరిశీలించారు.

### బల్దియా ఆదాయానికి

## భారీగా గండి

- చికెన్ వ్యర్థాల సేకరణకు టెండర్ పిలిచేది ఎప్పుడు..?
- టెండర్లకు పిలిస్తే 10 లక్షలకుపైగానే ఆదాయం.
- ప్రైవేటు వ్యక్తులకు చికెన్ వ్యర్థాల సేకరణ
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు


3లో

### జాతీయ రహదారి నిర్మాణంలో

## అర్హత గల ప్రతి ఒక్కరికి పరిహారం

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల,సూర్య మేజర్ న్యూస్ :**
జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా మంచిర్యాల–వరంగల్–ఖమ్మం – విజయవాడ జాతీయ రహదారి 163జి నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో బాధితుల కోల్పోయిన వివరాలను మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్రావుతో కలిసి పరిశీలించి కార్యాలయానికి వచ్చిన బాధితులతో మాట్లాడారు. జాతీయ రహదారి 163జి 384 కిలోమీటర్ల మేర ఉంటుందని, రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం బాధితులకు నష్టపరిహారం చెల్లించడం జరిగిందని,ఆర్బిట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మొదటి జాబితాలో పరిహారం అందని అర్హత గల వారు సంబంధిత పత్రాలు, బ్యాంక్ పాస్ పుస్తకాలతో సంప్రదించినట్లయితే రికార్డులు పరిశీలించి సరిగ్గా ఉన్నట్లు నిర్ధారణ జరిగితే సంబంధిత లబ్దిదారుల నుండి అక్విటెన్సీ తీసుకొని నిర్దేశిత ధరల ప్రకారం పరిహారం చెల్లించడం జరుగుతుందని, నష్టపోయిన వారు ఆలస్యం చేయకుండా త్వరగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### మంచిర్యాలలో శాంతి భద్రతలు

## కాపాడాల్సిన బాధ్యత పోలీసుల పై ఉంది

**-బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి**




**మంచిర్యాల టౌన్,జనవరి 16,సూర్య మేజర్ న్యూస్ :**
మంచిర్యాల పట్టణంలో బీజేపీ నాయకుడు మెట్టుపల్లి జయరామ రావు పై బుధవారం కాంగ్రెస్ గుండాలు చేసిన దాడిని ఖండిస్తూ,దాడి చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని,చట్ట పరంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ,గురువారం బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి,నాయకులు బిజెపి జిల్లా కార్యాలయం నుండి డీసీపీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ( మిగితా 3లో )

### జాతర ముసుగులో

## జూదం

**- అరికట్టిన నిర్మల్ జిల్లా పోలీసులు**





**సారంగాపూర్,సూర్య మేజర్ న్యూస్**
సారంగాపూర్ మండలం బండ రేవు తాండలో జరిగిన నానోజీ మహారాజ్ జాతరలో జూదం ఆడుతున్న పేకాటరాయుళ్లపై జిల్లా పోలీసులు దాడి చేశారు. సెక్యూరిటీ బృందాలు, పటిష్టమైన పెట్రోలింగ్ వ్యవస్థతో జూద స్థావరాలపై ఆకస్మిక దాడులు చేసి, జూదరులను అరికట్టారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల జూదం పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ( మిగితా...2లో )

# లబ్ధిదారుల జాబితా పకడ్బందీగా క్షేత్రస్థాయి పరిశీలన జరగాలి

## - జిల్లా పాలనాధికారి రాజర్షి షా

**ఆదిలాబాదు,సూర్య మేజర్ న్యూస్**

ఈ నెల 26న రిపబ్లిక్ డే పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తేనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి గ్రామసభల ద్వారా అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని జిల్లా పాలనాధికారి రాజర్షి షా గురువారం ఫీల్డ్ విసిట్‌ను పరిశీలించి అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా,లబ్ధిదారుల జాబితాను రూపొందించడంలో అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ నెల 16 నుండి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి జాబితాను రూపొందించాలని ఆదేశించారు. ఈ నెల 21 నుండి చేపట్టనున్న గ్రామ సభలలో ఆ జాబితాను ప్రవేశపెట్టి, ఆమోదం పొందిన మీదట అర్హుల జాబితాను కలెక్టర్ కార్యాలయంలో అందించాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద అర్హులైన కుటుంబానికి సంవత్సరానికి 12 వేల రూపాయలు, మొదటి విడతగా 6 వేల రూపాయలు అందించడం జరుగుతుందని, భూమిలేని నిరుపేదలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కనీసం 20



రోజులపాటు పని దినాలు ఉన్న వారి వివరాలతో అర్హుల జాబితా రూపొందించాలని,ఉపాధి హామీ కూలీల ఆధార్ కార్డును అనుసంధానం చేయడం జరిగిందని తెలిపారు.రైతు భరోసా పథకానికి అర్హులైన వారి జాబితా తయారు చేయాలని,ఎట్టి పరిస్థితులలో సాగుకు యోగ్యం కానీ భూములు, గుట్టలు, నివాసాలు కలిగిన ఇతర భూములు,వెంచర్లు, భూ సేకరణ కింద తీసుకున్న సాగునీటి ప్రాజెక్టులు,చెరువులు, కాలువలు, రైల్వే లైన్, రహదారుల కోసం తీసుకున్న భూముల వివరాలు జాబితాలో ఉండకూడదని తెలిపారు. సాగుకు యోగ్యంగా ఉండే భూముల వివరాలతో జాబితా తయారు చేయాలని,వ్యవసాయ అధికారులు రూపొందించిన జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుదారుల పూర్తి వివరాలను నమోదు చేయాలని, గ్రామీణ ప్రాంతాలలో నివసించే వారి వార్షిక ఆదాయం లక్షా 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాలలో నివసించే వారికి 2 లక్షల రూపాయలకు మించి ఉండకూడదని తెలిపారు. రేషన్ కార్డులలో పేర్ల తొలగింపులు, కొత్త పేర్లను చేర్చడం వంటివి కూడా చేయాల్సి ఉంటుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియ జిల్లాలో దాదాపుగా పూర్తయ్యిందని,అర్హులైన వారి జాబితా క్షేత్రస్థాయిలో మరోమారు సమగ్ర పరిశీలన జరపాలని, వార్డు సభలు, గ్రామ సభల ద్వారా అర్హులైన వారి జాబితా రూపొందించి మండల పరిషత్ అభివృద్ధి అధికారుల లాగిన్ ద్వారా కలెక్టర్ లాగిన్ కు పంపించాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనకు పంచాయతీ కార్యదర్శులు, మండల వ్యవసాయ విస్తరణాధికారులు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు, రెవెన్యూ సిబ్బందితో కూడిన బృందాలు పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తారని తెలిపారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా, ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా, ఆయా సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూరేలా పూర్తి పారదర్శకత, నిబద్ధతతో క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియను నిర్వహించాలని తెలిపారు.కలెక్టర్ వెంట తహసిల్దార్ తుకారాం, డిఎల్‌పీఓ.ఫణీంద్ర, ఎంపిడిఓ, ఏఈఓ,.ఏఓ., తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పథకాల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**మొదటి పేజీ తరువాయి..**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే సిబ్బంది సర్వేను పారదర్శకంగా చేపట్టాలన్నారు. రైతు భరోసా పథకంలో భాగంగా సాగుకు యోగ్యం లేని భూముల వివరాలు నమోదు



చేయకూడదన్నారు. వివిధ పనుల పై ప్రభుత్వము చేపట్టిన భూసేకరణ కింద తీసుకున్న భూముల కు రైతు భరోసా ఇవ్వకూడదన్నారు. రాళ్ళ ,గుట్టలు గల భూములను పరిశీలించాలని సూచించారు. రేషన్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటికి వెళ్లి కుటుంబ వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో అన్హారులకు ప్రభుత్వ పథకాలు అమలు కాకుండా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే ను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమిలేని వ్యవసాయ కూలీలు నిరుపేదలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2023- 24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులపాటు పనిచేసిన కుటుంబాలను గుర్తించి జాబితాను రూపొందించి గ్రామ సభలలో ప్రవేశపెట్టాలన్నారు. నిర్ణయిత గడువులోగా సర్వేను పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సందీప్ నగర్ లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రోహిత్ కుమార్ ,ఎంపీడీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## జాతర ముసుగులో జూదం

### - అరికట్టిన నిర్మల్ జిల్లా పోలీసులు

**మొదటి పేజీ తరువాయి...**

జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా పోలీసులు నానోజీ మహారాజ్ జాతరలో ఉన్న పేకాట కేసినోలను అరికట్టారు. సారంగాపూర్ మండలం బండ రేవు తాండలో భారీ ఎత్తున పేకాట ఆడుతున్న దృశ్యాలు తెలుసుకున్న తర్వాత, వారు ప్రత్యేకంగా పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టపరిచారు. ఈ క్రమంలో, పోలీసులు మూడు బృందాలతో జూదం ఆడే ప్రదేశాలను గాలించి దాడి చేశారు.పేకాటరాయుళ్లు జాతర ముసుగులో టెంట్లను వేసి దుకాణాల మాదిరిగా పరిచయం చేసుకుని జూదం ఆడుతున్నారు. పోలీసులు వాటిని చాకచక్యంగా గుర్తించి ఆకస్మికంగా దాడి చేసారు. ఈ దాడి కారణంగా జూదరులు తమ స్థావరాలను విడిచిపెట్టి పారిపోయారు.మహారాష్ట్ర నుంచి వచ్చిన పేకాటరాయుళ్లు మూడు రోజులపాటు ఈ జాతరలో జూదం ఆడేవారని సమాచారం.జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ పేకాట జూదం కుటుంబాలను అరికట్టేలా పనిచేస్తోంది. జూదం ఆడితే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ఎస్పీ మాట్లాడుతూ భక్తి భావంతో జాతరను జరపాలని సూచించారు జూదం తో కాకుండా పండగలలో జూదం చేసే వారిపై చట్ట రీత్యా చర్యలు ఉంటాయని తెలిపారు.

## తల సేమియా వ్యాధి తో బాధ పడుతున్న అమ్మాయికి ఆర్థిక సాయం అందజేసిన యువకులు

**ఇచ్చోడ, జనవరి 16, సూర్య మేజర్ న్యూస్**

మండల కేంద్రం లోని ముఖరా (బి) గ్రామానికి చెందిన శివంగి అనే బాలిక గత కొన్ని రోజులుగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన 2007-08 బ్యాచ్ విద్యార్థులు తమ వంతు బాలికకి వైద్య ఖర్చుల కోసం రూ. 21000 వేల రూపాయలను అందజేసిన తమ ఉదరాతను చాటుకున్నారు.దీంతో బాధిత కుటుంబ సభ్యులు వారికీ కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ కార్యక్రమం 2007-08 బ్యాచ్ విద్యార్థులు సాయి, మురళి, శివ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



## ఏం చెప్పవచ్చంటే.. :

ఫిర్యాదు చేసిన తర్వాత కేసు నమోదు ఎలా చేశారు.ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేశారా లేదా...?ఎఫ్ఐఆర్ చేశారా...? లేదా..?పోలీసులు మాట్లాడిన తీరు ఎలా ఉంది?ట్రాఫిక్ ఈ చలాన్లు గురించి. పాస్ పోర్ట్ ధ్రువీకరణ ఏ స్థితిలో ఉంది?ఇతర సేవలు గురించి చెప్పొచ్చు.

### ఎలా స్కాన్ చేయాలి :

చరవాణితో క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయాలి.ఓపెన్ వెబ్ సైట్ అని ట్యాప్ షటర్ బటన్ రాగానే దానిపై నొక్కాలి.సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఫాం, పోలీసు శాఖల సేవలపై ప్రజల అభిప్రాయ సేకరణ పేజీ తెరుచుకుంటుంది.తెలుగు, ఆంగ్ల భాషల్లో ఒక దానిని ఎంచుకోవాలని సూచిస్తుంది.భాష ఎంచుకున్న తర్వాత పేరు, చరవాణి నెంబరు,ఈమెయిల్ ఐడీ,అభిప్రాయం,జిల్లా లేదా కమిషనరేట్ పేరు, ఠాణా పేరు నమోదు చేయాలి.తర్వాత కాలంలో అభిప్రాయం రాయాలి. ఇలా నింపిన ఫారాన్ని పంపించాలి.

### గతంలో.. :

పోలీసు శాఖ పని తీరును గతంలో థర్డ్ పార్టీ విచారణ ద్వారా తెలుసుకునేవారు.ఫిర్యాదు చేసిన వ్యక్తుల్లో కొందరికి హైదరాబాద్ నుంచి కాల్ చేసి వివరాలు సేకరించేవారు.ఇది అంతగా ఫలితం ఇవ్వలేదు.

## సరైన సేవలు అందించేందుకు క్యూఆర్ కోడ్..

### - లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్

లక్షెట్టిపేట మండల పరిధిలో పోలీస్‌లు అందిస్తున్న సేవలపై ప్రజలు తమ అభిప్రాయాలను నిరభ్యంతరంగా తెలుపెందుకు క్యూఆర్ కోడ్ ఉపయోగపడుతుంది. మీ అభిప్రాయాలు తెలుపడానికి ఎవరు భయపడవద్దు.తెలిపిన వారి వివరాలు గొప్యంగా ఉంచబడతాయి. మీరిచ్చే అభిప్రాయాలు మా పని తీరును మరింత మెరుగు పరుచుకొనేందుకు దోహదపడతాయి.



### రఘునాథ్ రావుకు ఎం ఎల్ సి టికెట్ రాకపోవడంతో

## మతిభ్రమించి ఎమ్మెల్యే పై తప్పుడు ఆరోపణలు

**మంచిర్యాల టౌన్, జనవరి 16,సూర్య మేజర్ న్యూస్ :**

మంచిర్యాలలో ఎక్కడ గొడవ జరిగినా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు అంటకట్టడం విపక్షాలకు రివాజుగా మారిందని కాంగ్రెస్ నేతలు అన్నారు.గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ రావు, కౌన్సిలర్ గాజుల ముఖేష్ గౌడ్,మిట్టపల్లి లక్ష్మి పై డీసీపీ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. మిట్టపల్లి జయరామ్ రావుపై దాడి ఘటనను ఎమ్మెల్యేపై రుద్దేందుకు వారు ప్రయత్నం చేస్తున్నారని బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షుడు తిరుపతి ఆరోపించారు.వ్యక్తిగత గొడవలు,



భూతగాదాలను ఎమ్మెల్యే కనుసన్నల్లో జరుగుతున్నాయని అభియోగించడం శోచనీయమని అన్నారు.జయరామ్ పై దాడికి ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు.జయరామ్ రావుపై ఉదయం దాడి జరిగితే రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.అభివృద్ధి,సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యేను ప్రజల్లో పలుచన చేయడానికి బీజేపీ,బీఆరెస్ రెండు విపక్షాలు సంయుక్తంగా కుట్ర పన్నాయని ధ్వజమెత్తారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలని ఉబలాట పడిన రఘునాథ్ రావుకు టికెట్ రాకపోవడంతో మతిభ్రమించి,ఎమ్మెల్యే పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని అన్నారు.ఎమ్మెల్యే కాంగ్రెస్ శ్రేణులను క్రమ శిక్షణలో ఉంచుతున్నారని,శ్రేణులు గీత దాటే విధంగా ప్రేరేపితం చేయవద్దని కోరారు.చట్టం తన పని చేసుకుపోతుందని తప్పు చేసే వారికి శిక్ష పడుతుందని అన్నారు.

# మంచిర్యాలలో శాంతి భద్రతలు కాపాడాల్సిన బాధ్యత పోలీసుల పై ఉంది

**-బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి.**

**మొదటి పేజీ తరువాయి...**




అనంతరం డీసీపీ కార్యాలయంలో డీసీపీని కలిసి జిల్లాలో గత సంవత్సరం నుండి ప్రతిపక్ష నాయకుల పై దాడులు జరుగుతున్న,దాడులు చేస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రఘునాథ్ అన్నారు.బుధవారం బీజేపీ నాయకుడు జయరామ రావు పై అమానుషంగా ముగ్గురు యువకులు,కాంగ్రెస్ పార్టీ నాయకుల అండతో దాడి చేయడంతో, వారు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు తెలిపారు.దాడి చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని,మరొక సారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డీసీపీ కి వినతి పత్రం అందజేశారు.వినతి పత్రం తో పాటు గతంలో జరిగిన సంఘటనలు పై పత్రిక వార్తల్లో వచ్చిన పత్రిక కథనాల పత్రులను జత చేసి వారికి అందజేశారు.ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గంలో ఎన్నడు లేని విధంగా,గతంలో ఎంతో మంది ఎమ్మెల్యేలుగా పనిచేసిన ఇలాంటి దాడుల సంస్కృతి మంచిర్యాల నియోజకవర్గంలో చోటు చేసుకోలేదని అన్నారు.గత ఏడాది నుండి ప్రేమ్ సాగర్ రావు ఎమ్మెల్యే అయిన నాటి నుండి పలువురు యువకులను దురలవాట్లకు బానిసలను చేసి ప్రతి పక్ష నాయకుల పై దాడులకు దిగుతున్నారు అని అన్నారు.మంచిర్యాల లో ఎన్నడూ లేని విష సంస్కృతిని తీసుకవచ్చారని,ప్రశాంతంగా ఉన్న మంచిర్యాలను అలజడులతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు.ఒక్క వ్యక్తి ఎమ్మెల్యే పేరు చెప్పుకుంటూ బ్యాచ్ లను మెయింటైన్ చేస్తూ వ్యాపారస్తులను,ప్రతి పక్ష పార్టీ నాయకులను బెదిరిస్తూ వసూళ్లకు పాల్పడుతున్న ఎమ్మెల్యే మాత్రం స్పందించకుండా దాడులు చేపిస్తున్న వారికి అండగా నిలుస్తున్నారని అన్నారు. మంచిర్యాల లో ఇలాంటి విష సంస్కృతిని ప్రోత్సహించడం సరి కాదని,ప్రజాస్వామ్యంలో ప్రశ్నించి హక్కు అందిరికీ ఉందని,ఏదైన ఉంటే న్యాయం బద్ధంగా కొట్లాడాలని హితవుపలికారు.ఇంకొసారి ఇలాంటి దాడులకి పాల్పడితే సహించేది లేదని బీజేపీ పార్టీ నాయకులు,కార్యకర్తలు చూస్తూ ఊరుకోరు అని హెచ్చరించారు.దాడి చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో డీజీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని తెలిపారు.మంచిర్యాలలో శాంతి భద్రతలు కాపాడాల్సిన బాధ్యత పోలీసుల పై ఉందని, పట్టణాన్ని ప్రశాంతగా ఉంచుతూ,ఇలాంటి దాడులకు ప్రేరేపిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో దుర్గం అశోక్,పెద్దపల్లి పురుషోత్తం,నగునూరి వెంకటేశ్వర గౌడ్,గాజుల ముఖేష్ గౌడ్,తుల ఆంజనేయులు,అమీరిశెట్టి రాజు,సత్రం రమేష్,నాగిరెడ్డి హేమంత్ రెడ్డి,వీరమల్లు హరి గోపాల్,గడ్డం స్వామి రెడ్డి,గోపతి రాజన్న,వంగపల్లి వెంకటేశ్వర్ రావు,కర్రె లచ్చన్న,మోటపలుకుల గురువయ్య,గాదె శ్రీనివాస్,జోగుల శ్రీదేవి, మోతే సుజాత,బియ్యాల సతీష్ రావు,పల్లి రాకేష్,ముదాం మల్లేష్,తదితరులు పాల్గొన్నారు.

# బల్దియా ఆదాయానికి భారీగా గండి

**మంచిర్యాల జనవరి 16, సూర్య మేజర్ న్యూస్ :**



వాస్తవానికి చికెన్ వ్యర్థాల సేకరణకు బల్దియా తప్పనిసరిగా టెండర్లు వేయాల్సి ఉంటుంది. వేలంలో పోటీ పెరిగి మున్సిపాలిటీకి ఆదాయం నమకూరుతుంది. ఇదంతా తెలిసినా బల్దియా అధికారులు మాత్రం టెండర్లు ఎందుకు వేయడం లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో కొందరు కౌన్సిలర్లు చికెన్ వ్యర్థాల సేకరణకు టెండర్లు ఎందుకు వేయడం లేదని, ఎవరు సేకరిస్తున్నారని అధికారులను ప్రశ్నిస్తే.. వారి నుంచి సమాధానం రాలేదు. మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలపై ఆరోపణలు వస్తుండడం.. చిన్నచిన్న విషయాలను పట్టించుకోకపోవడంపై ప్రజలు పెదవి విరిస్తున్నారు.జిల్లా కేంద్రమైన మంచిర్యాల మున్సిపాలిటీలో చికెన్ వ్యర్థాల సేకరణకు టెండర్లు పిలవడం లేదు. జిల్లాకేంద్రం కావడంతో చికెనె సెంటర్లు వీరి విగా వెలిశాయి. ఆ సెంటర్ల నుంచి వెలువడే వ్యర్థాల సేకరణకు ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చినట్లు సమాచారం. అయితే సదరు వ్యక్తి ఎవరనేది మాత్రం ఎవరికీ తెలియదు. చికెన్ వ్యర్థాల సేకరించే వారి నుంచి గతంలో ఓ అధికారి అమ్యామ్యాలు పుచ్చుకున్నట్లు తెల్సింది.

### టెండర్లకు పిలిస్తే 10 లక్షలకుపైగానే ఆదాయం.

జిల్లాకేంద్రంలో సుమారు వందకుపైగానే చికెన్ సెంటర్లు ఉన్నాయి. జిల్లా మొత్తంగా వెయ్యికి పైగానే ఉంటాయని అంచనా. జిల్లాలో కోళ్లఫారాలు కూడా అధికంగానే ఉండటంతో చికెన్ సెంటర్ల వ్యాపారం అధికంగానే జరుగుతుంది. ఆయా సెంటర్ల నుంచి వందల క్వింటాళ్లకు పైబడి వ్యర్థాలు వెలువడే అవకాశం ఉంటుంది. వాటిని సేకరించే ఏజెన్సీలు చేపల వ్యాపారులకు విక్రయిస్తారని తెలిసింది. ఈ క్రమంలో వీటి సేకరణకు నిబంధనల ప్రకారం టెండర్లు పిలవాల్సి ఉంటుంది. ఇదే జరిగితే బల్దియాకు సుమారు రూ.10 లక్షలకుపైగానే ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయినప్పటికీ అధికారులు ఈ విషయాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థంకాని ప్రశ్నగా మిగులుతోంది. మరోవైపు వచ్చే నెలలో పాలకవర్గం గడువు ముగియనుంది. ఆ తర్వాత ప్రత్యేక అధికారుల పాలన వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో పాలకవర్గం స్పందించి ఆ లోపే టెండర్లు పిలవాలని పలువురు పేర్కొంటున్నారు...

### టెండర్లు నిర్వహించిన దాఖలాలు లేవు..!

జిల్లాలో ప్రధాన మున్సిపాలిటీ అయిన మంచిర్యాలలో మాత్రం టెండర్లు నిర్వహించిన దాఖలాలు లేవు.ఏళ్ల తరబడిగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నా ఇప్పటివరకు అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.వాస్తవానికి రూ. లక్షకు మించి ఆదాయం వచ్చే ప్రతి అంశానికి ఆన్లైన్లో టెండర్లు నిర్వహించాల్సి ఉంటుంది.టెండర్లు పిలిస్తే చాలామంది పాల్గొని పోటీ పెరుగుతుంది. ఇందులో అధికంగా కోట్ చేసిన ఏజెన్సీలకు పనులు అప్పగించాల్సి ఉంటుంది.అయితే మొదటి నుంచే ఇక్కడ టెండర్లు వేసిన దాఖలాలు లేవు.

### వ్యర్థాలు ఎక్కడబడితే అక్కడే ..

కొన్నిచోట్ల చికెన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలను డ్రైనేజీల సమీపంలో, కాలువలు, చెరువుల్లో పడేస్తున్నారు. డ్రైనేజీల్లో చేరుతున్న పందులు వ్యర్థాలను రోడ్లపైకి తీసుకొస్తున్నాయి. కుక్కలు వాటిని ఆగమాగం చేస్తున్నాయి. అధికారులు స్పందించి ఏజెన్సీకి ఇస్తే అటు బల్దియాకు ఆదాయం రావడంతో పాటు, ఇటు చికెన్ వ్యర్థాలు ఎక్కడబడితే అక్కడ ఉండవు.

### త్వరలో ఓపెన్ టెండరు నిర్వహించి సమస్య పరిష్కరిస్తాం...మారుతి ప్రసాద్ పుర కమిషనర్

కోడి వ్యర్థాల సేకరణపై త్వరలోనే టెండర్ల ప్రక్రియను నిర్వహిస్తామని మంచిర్యాల మున్సిపల్ కమీషన్ పేర్కోన్నారు.

మరి ఇప్పటి వరకు మున్సిపాలిటీ పరిధిలోని కోడి వ్యర్థాలను ప్రైవేటు వ్యక్తులు సేకరించడం వెనుక అధికారుల హస్తం లేకుంటే టెండర్లను ఎందుకు పిలవలేదు అనేది బేతాళ ప్రశ్న.ఏది ఏమైనప్పటికి టెండర్లను పిలవకపోవడంతో లాభం ఎవరి జేబులోకి చేరిందో..?అధికారులు ఎందుకు మిన్నకుండి పోయారో తేల్చాల్సింది అధికారులే...!

ప్రతి లబ్ధిదారుడికి

# సంక్షేమ పథకాల ఫలాలు అందాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**

**జైనూర్ జనవరి 16 మేజర్ సూర్య న్యూస్**

జిల్లాలో అర్హత గల ప్రతి లబ్దిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించే విధంగా అధికారులకు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లాలోని జైనూర్ మండలం ఊషెగాం గ్రామంలో కొనసాగుతున్న రైతు భరోసా సర్వేలో భాగంగా వ్యవసాయ భూములను క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి



పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా, రేషన్ కార్డులు ఇతర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై సమగ్ర విచారణ జరిపి ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా జాబితా రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలు ద్వారా జిల్లాలోని అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుదారులలో అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి జాబితాను రూపొందించాలని తెలిపారు. రైతు భరోసా పథకానికి అర్హులైన వారి జాబితా తయారు చేయాలని, వ్యవసాయ అధికారులు రూపొందించిన జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు పథకాల వారీగా అధికారులను నియమించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, వ్యవసాయ విస్తరణాధికారి, పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బంది, రైతులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తప్పిదాలు లేకుండా

# సర్వే చేయాలి

**- ఆడిషనల్ కలెక్టర్ డేవిడ్**



**వాంకిడి జనవరి 16,సూర్య మేజర్ న్యూస్**

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం చేపడుతున్న సర్వేలో ఎలాంటి తప్పిదాలు లేకుండా అర్హులను ఎంపిక చేయాలని జిల్లా అదనపు పాలనాధికారి (రెవెన్యూ) డేవిడ్ అన్నారు. గురువారం వాంకిడిలో చేపడుతున్న సర్వేను పరిశీలించారు. రేషన్ కార్డుల జారి, రైతు భరోస, ఆత్మీయ భరోస, ఇందిరమ్మ ఇండ్లు పథకాలకు దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని అన్నారు. అర్హులైన వారిని గుర్తించి ఆ జాబితతో గ్రామ సభలో చర్చించాలని అన్నారు. వ్యవసాయానికి యోగ్యం కాని భూములను గురించి జాబితను తయారు చేయాలని సూచించారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి రాథోడ్ బిక్కు ఎమ్మార్వో రియాజ్ అలీ, ఎంపివో జావిద్ ఆర్ప మాజిత్, పంచాయతి కార్యదర్శి శివకుమార్, తదితరులు ఉన్నారు.

# సర్టిఫికెట్స్ దొరికిన వారు తిరిగి ఇవ్వగలరు

**బోథ్, జనవరి 16,సూర్య మేజర్ న్యూస్**

బోథ్ మండలంలోని కరత్వడా గ్రామానికిచెందిన దేశం. సుప్రియ తండ్రి బీమలింగు. గురువారం 9/01/2025 రోజు ఆదిలాబాద్ నుండి బోథ్ పల్లెవెలుగు(టిఎస్ బి81459) బస్సులో వస్తుండగా తనకు సంబంధించిన లగేజ్ బ్యాగ్ కనబడకుండా పొఇందని, అందులో చదువుకు సంబంధించిన టెన్త్, ఇంటర్, బోనఫాయిడ్‌లు ఒకటి నుండి ఇంటర్ వరకు గల అన్ని సర్టిఫికెట్‌లు పోయాయాని తెలిపారు. ఎవరికైనా తన యొక్క సర్టిఫికెట్‌లు దొరికితే దయచేసి 6305958061,9603235505 నెంబర్‌లకు ఫోన్ చేసి తెలపగలరని కోరారు.

## క్రికెట్ క్రీడాకారులకు ప్రైజ్ మనీ అందజేసిన

### ప్రజాపక్షం రిపోర్టర్ దుర్గాప్రసాద్

**మంచిర్యాల( జైపూర్) జనవరి 16,సూర్య మేజర్ న్యూస్**

జైపూర్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మండల స్థాయి వివి క్రికెట్ పోటీల్లో భాగంగా గురువారం మిట్టపల్లి వెంకటరావుపల్లి టీముల మధ్య జరిగే మ్యాచ్‌లో వెంకట్రావుపల్లి క్రికెట్ టీం



సభ్యులకు మద్దతు తెలుపుతూ ప్రతి ఫోర్ కి ప్రతి సిక్స్ కి ప్రతి వికెట్ తీసిన క్రీడాకారులకు ఒక్కొక్క దానికి 100 రూపాయల చొప్పున నగదు రూపంలో ప్రైజ్ మనీ అందజేశారు. ఈ సందర్భంగా దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు డాక్టర్ వివేక్ వెంకటస్వామి పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు వంశీకృష్ణ ఏడాది పాలన విజయవంతమైన సందర్భాన్ని పురస్కరించుకొని ఈ క్రికెట్ పోటీలు నిర్వహించడం చాలా గొప్ప విషయమని అన్నారు. యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా శరీర దృఢత్వానికి మానసిక ఉల్లాసానికి క్రీడలు బాగా ఉపయోగపడతాయని అన్నారు.క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో క్రీడలు ఆడాలని గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దుశ్శా అవినాష్ భూమన్న క్రికెట్ టీం కెప్టెన్ భీమిని సంజీవ్ క్రీడాకారులు భీమేష్ అరుణ్ అక్షయ్ తేజ కామెర మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల ప్రీమియర్ లీగ్ (ఎం పి ఎల్ ) విజేత టీంకు

# ట్రోఫీలు అందజేసిన అంజనీపుత్ర యాజమాన్యం

**మంచిర్యాల టౌన్,సూర్య మేజర్ న్యూస్ :**

మంచిర్యాలలోని శివాజీ గ్రౌండ్‌లో గత పది రోజులుగా జరగుతున్న ఎం పి ఎల్ సీజన్ 2 క్రికెట్ పోటీలలో భాగంగా గురువారం ఎస్.ఆర్.హెచ్,ఎన్‌టిఆర్ నగర్,గుడిపేట టైటన్స్‌ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగగా, విజేతలుగా గుడిపేట టైటన్స నిలిచారు.విజేత టీం వారికి ఒక లక్ష రూపాయల ప్రైజ్ మనీ,ట్రోఫీని అంజనీపుత్ర అధినేత గుర్రాల శ్రీదర్,ఎం.డి పిల్లి రవి అందజేశారు.రన్నర్స్ టీం వారికి వసుధ హాస్పిటల్ సన్నీ పటేల్,కెల్విన్ హాస్పిటల్



కొమ్ము శ్రీనివాస్,ఉదారి చంద్రమోహన్ గౌడ్ 50 వేల రూపాయల నగదును,బహుమతిని అందజేశారు.ఈ సందర్భగా గుర్రాల శ్రీదర్ మాట్లాడుతూ ఐపీఎల్ తరహాలో టోర్నమెంట్ నిర్వహించిన గురూస్ క్రికెట్ అకాడమీ నిర్వాహకులు దుర్గా ప్రసాద్ గారికి,బింగి శివకిరణ్,వైద్య ప్రశాంత్ , శ్రీనివాస్,బొంతల శివ,కోకాకోలా లక్ష్మణ్,సంతోష్‌కు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అంజనీపుత్ర ఎక్సిక్యూటివ్ డైరెక్టర్లు సూరినేని కిషన్,కాసర్ల సదానందం,డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు

## గౌడ్ సమస్యల పరిష్కారాన్ని కృషి

### - మోకు దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనిల్ గౌడ్

**తిర్యాని,జనవరి 16 సూర్య మేజర్ న్యూస్**

రాష్ట్రంలోని గీత కార్మికుల సమస్యల పరిష్కారాని కృషిచేనునట్లు గౌడ జనాక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) రాష్ట్ర ఉపాధ్యక్షులు జువ్వాజి అనిల్ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మార్క శంకర్ గౌడ్ అన్నారు.మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ ఆవరణలో మోకు దెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి తాళ్ల శ్రీనివాస్ గౌడ్ ,జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు బొమ్మగోని శంకర్ గౌడ్‌లతో కలసి గౌడ సంఘం నూతన క్యాలెండర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న



సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షులు పేరుమాండ్ల లచ్చా గౌడ్, మండల ఉపాధ్యక్షులు పెరుమండ్ల వెంకటేష్ గౌడ్, తీగల నరసయ్య గౌడ్, గున్నాల నారాయణ, పెరుమండ్ల బాలేష్ గౌడ్, పెరుమండ్ల లచ్చన్న గౌడ్ రంగు రాజశేఖర్ గౌడ్, నాగపూరి రమేష్ గౌడ్, కులస్తులు తదితరులున్నారు.

## ఏకగ్రీవంగా ఎమ్మార్పీఎస్ కొటబి గ్రామం కమిటీ ఎన్నిక

**బోథ్, జనవరి 16,సూర్య మేజర్ న్యూస్**

బోథ్ మండలంలోని కొట (బి)గ్రామంలో బుధవారం ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలేప్ గణేష్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని, ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు కస్వామి,జిల్లా నాయకులు అశోక్,రవి పాల్గొన్నారని కమిటీ సభ్యులు తెలపడం జరిగింది.ఈ కమిటికి అధ్యక్షులుగా గంగయ్య,ఉపాధ్యక్షులుగా హరిప్రసాద్,ప్రధాన కార్యదర్శిగా గంగాధర్, కార్యదర్శిగా జైపాల్, సంయుక్త కార్యదర్శిగా సాయన్న, ప్రచార కార్యదర్శిగా హరికాంత్,కోశాధికారిగా జ్ఞానేశ్వర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

## ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న భైంసా యాత్రికులు సురక్షిత తిరుగు ప్రయాణం

**భైంసా టౌన్,జనవరి 15,సూర్య మేజర్ న్యూస్**

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బృందావన్ క్షేత్రంలోని బస్సు అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న భైంసా డివిజన్ యాత్రికులు స్వస్థలాలకు తిరుగు ప్రయాణమయ్యారు.మంగళవారం సాయంత్రం నుంచి వృందనాద్ క్షేత్రంలోని టూరిస్ట్ పెనలిట్ సెంటర్లో అక్కడి పోలీసు, రెవెన్యూ అధికారుల సంరక్షణలోనున్న ఇక్కడి యాత్రికుల బృందం



బుధవారం ఉదయం వేళలో భైంసాకు జయలుదేరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిలు చొరవ



చూపి అక్కడ చిక్కుకున్న యాత్రికులను స్వస్థలాలకు తరలింప చేసేందుకు చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. వీరిద్దరి విజ్ఞప్తికి స్పందించిన అక్కడి రెవెన్యూ, పోలీసు అధికారుల బృందం యాత్రికులను భైంసాకు తరలించేందుకు గాను రెండు బస్సులను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఒక్కో యాత్రికునికి దారి ఖర్చులకు గాను రూ. 1000 చొప్పున పంపిణీ చేశారు. ఉదయం వేళలో యాత్రికులకు భోజనాలు అందించిన అక్కడి అధికారులు, ఆర్ఎస్ఎస్ శ్రేణులు మార్గమధ్యంలో భోజనాలు చే సేందుకు గాను ఆహర ప్యాకెట్లను అందచేశారు. వీటితో పాటు బిస్కెట్ పాకెట్లు, కొన్ని రకాల పండ్లు, వాటర్ బా టిళ్ళు సైతం యాత్రికులకు సమకూర్చారు. దీర్ఘకాలిక వ్యాధులతోనున్న బాధితులు వేసుకునేందుకు గాను రోజు వారి మాత్రలను సైతం అందించారు. బుధవారం ఉదయం అక్కడి నుంచి బయలు దేరిన యాత్రికుల బృందం గురువారం రాత్రి వేళ వరకు భైంసాకు చేరుకోనున్నట్లుగా తెలిసింది. మంగళవారం రాత్రి వేళ నుంచి బుధవారం వరకు యాత్రికుల బృందానికి అక్కడి పోలీసు, రెవెన్యూ అధికారులతో పాటు అర్ఎస్ఎస్ శ్రేణులు, పలు వ్యాపార సంస్థల ప్రతినిధులు వసతి కల్పించి పూర్తి స్థాయిలో సపర్యలు చేసినట్లుగా సమాచారం. వారందరూ సమన్వయంతో వ్యవహరిస్తూ సమిష్టిగా యాత్రికులకు సేవలు అందించినట్లుగా తెలిసింది. తమకు కప్పుకునేందుకు దుప్పట్లు, ధరించేందుకు దుస్తులు, తొడుక్కునేందుకు చెప్పులతో పాటు అవసరమైన ఇతర సామాగ్రిని ఉచితంగా అందచేసారని యాత్రికులు తె లిపారు. ఆందోళనలతోనున్న తమకు అక్కడి వారు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి కొలుకునేలా తోడ్పాటునిచ్చారని పలువురు యాత్రికులు వివరించారు. కుటుంబ సభ్యుల వలే ఆదరించి తమను అన్ని విదాలుగా ఆదుకున్నారని యాత్రికులు పేర్కొన్నారు. వారందరికీ జన్మజన్మల రుణపడి ఉంటామని యాత్రికుల బృందం తెలిపింది.

### చలో ఉట్నూర్ మహాధర్నాను

# విజయవంతం చేయండి

### -ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకుల పిలుపు

**ఇంద్రవెల్లి,జనవరి 16 మేజర్ సూర్య న్యూస్:**

ఏజెన్సీ ప్రాంత చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు కుడే కైలాష్ డిమాండ్ చేశారు.గురువారం మండలంలోని స్థానిక ఆదివాసి అమరవీరుల స్థూపం వద్ద మహా ధర్నాకు సంబంధించిన కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు అన్నాటి ఆదివాసీ యోధుల పోరాటాలు వారి ఉద్యమ స్ఫూర్తి ఫలితంగా రాజ్యాంగంలో 5,6 షెడ్యూల్లో పొందపరిచిన చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకుండా ఆదివాసులకు తీవ్ర అన్యాయం



చేస్తున్నాయని దుయ్యబట్టారు. జి.ఓ నం 3 ,1/70 , పీసా చట్టాలతో పాటు పో డు భూములకు పట్టాలిచ్చి ఆదివాసులకు శాశ్వత హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న ఉట్నూర్ మండల కేంద్రంలో నిర్వహించే చలో ఉట్నూర్ మహాధర్నను విజయవంతం చేసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి,రామారావ్, మండల అధ్యక్షులు తొడసం ఇంద్రూ,అర్క ఒమేశ్, దకూర్.రామచందర్,మెస్రం గోవింద తదితరులు పాల్గొన్నారు.

### గణతంత్ర వేడుకలను

# ఘనంగా నిర్వహించాలి

### - సింగరేణి ఏరియా జీఎం దేవేందర్

**మందమర్రి, జనవరి 16, సూర్య మేజర్ న్యూస్.**

సింగరేణి ఆధ్వర్యంలో ఈ నెల 26 న నిర్వహించే 76వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని సింగరేణి ఏరియా జీఎం దేవేందర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో పలు విభాగాల అధికారులతో జీఎం సమీక్ష సమావేశం నిర్వహించి గణతంత్ర వేడుకలను సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో వైభవంగా నిర్వహించేందుకు అధికారులకు పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం విజయ ప్రసాద్, రక్షణ అధికారి రవీందర్, కేకే గ్రూప్ ఏజెంట్ రామదాసు, డివైజీఎం ఈఅండ్ఎం వెంకటరమణ, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డీజీఎం ఐఈడి రాజన్న, సివిల్ ఎస్ఈ రాము, పలు డిపార్ట్మెంట్ల అధికారులు, అన్ని గనుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సంరక్షణపై కళా బృందంచే ప్రజలకు అవగాహన



**మందమర్రి,సూర్య మేజర్ న్యూస్.**

ఆరోగ్య సంరక్షణపై పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజలకు జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కళాబృదంచే జీవనశైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు మానసిక ఆరోగ్యం గురించి తెలియజేస్తు క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని యాపల్ ప్రాంతం, ఊరు మందమర్రి గ్రామాలలో గురువారం సాంస్కృతిక కళాకారులు అవగాహన కల్పించారు. ఆయుష్మాన్ భవ ఆరోగ్య కేంద్రాల ద్వారా అందిస్తున్న వైద్య స ద ు ఎా య ూ ల ు తెలియజేయడం, లింగనిర్దారణ నేరము ఆడ అయినా మగ అయిన ఒకటే, భేటీ బచావో బేటి పడావో అనే నినాదాలతో ప్రచారం కల్పించారు. పీహెచ్ సి పరిదిలో గర్భవతుల నమోదు, ఆసుపత్రుల్లో ప్రసవాలు వంద శాతం టీకాలు ఇప్పించడం జాతీయ క్షయ, కుష్టు నివారణ కార్యక్రమాలు అసంక్రమణ వ్యాధులైన బిపి షుగర్, క్యాన్సర్ వ్యాధులను గుర్తించి చికిత్స చేయడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. 108 వాహనంపై రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సదుపాయం 10 లక్షల వరకు పొందడం పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, పర్యవేక్షకులు కళావతి, రమేష్ మధుసూదన్, సుజాత, రాజేశ్వరి, పద్మావతి, జ్యోతి, దేవిక, అనిత, ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## తిర్యాణి మండలంలో కొనసాగుతున్న సర్వే

**తిర్యాణి జనవరి 16 సూర్య మేజర్ న్యూస్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా సర్వే,రేషన్ కార్డులు ఇంద్రమ్మ ఇళ్ల సర్వేను గురువారం తిర్యాణి తాసిల్దార్ సూర్య ప్రకాష్, స్థానిక ఎంపీడీవో వేముల మల్లేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వం



చేపడుతున్న పథకాలను ప్రజలకు అందించే విధంగా అధికారులంత కృషి చేస్తున్నారని తెలిపారు. సర్వే కార్యక్రమంలో భాగంగా ఈరోజు విజయనగరంలో పర్యటించడం జరిగిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం

**భైంసా టౌన్,జనవరి 16,సూర్య మేజర్ న్యూస్**

బైంసా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం గురువారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తో భేటీ అయ్యారు. ప్రభుత్వం పియం ఉషా కింద కళాశాలకు ఐదు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడంతో పనులు సత్వరమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా కళాశాల సౌకర్యాలు,విద్యార్థుల చదువుల అంశంపై



ఎమ్మెల్యే ఆరా తీశారు. పనులు తక్షణమే ప్రారంభించేలా అధికారులకు సూచనలు ఇస్తానని ఆయన అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య,వైస్ ప్రిన్సిపల్ కె. రఘునాథ్,అధ్యాపకులు డా. భీమా రావు,జి. సుధాకర్,డా. పి. జి. రెడ్డి,డా. శంకర్, డా. ఓం ప్రకాష్,టీ. సురేందర్,మోహన్ తదితరులు ఉన్నారు.

## కారుణ్య నియామకాల పత్రాల ఆందజేత

**మందమర్రి, జనవరి 16, సూర్య మేజర్ న్యూస్.**

కారుణ్య నియామకాల ద్వారా సింగరేణిలో నూతనంగా ఉద్యోగంలో చేరుతున్న అభ్యర్థులకు సింగరేణి ఏరియా జిఎం జి దేవేందర్ నియామక పత్రాలు అందజేశారు. ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో



మెడికల్ ఇన్ వాలిడేషన్ ద్వార నూతనంగా ఉద్యోగాలు పొందిన డిపెండెంట్లు 8 మందికి కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ ఇతర పరిశ్రమలతో పోలిస్తే సింగరేణిలో పని స్థలాలు సమయాలు భిన్నంగా ఉంటాయని, ప్రభుత్వ రంగ పరిశ్రమలలో ఉద్యోగం పొందడం అదృష్టంగా భావించి సింగరేణి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఏరియాలో ఇప్పటివరకు కారుణ్య నియామకాల ద్వార 1806 మందికి ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఉద్యోగాలు పొందిన యువ కార్మికులు కష్టపడి పనిచేసి ఉన్నత స్థాయికి ఎదగాలని, విధులకు గైర్హాజరు అయితే ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని దీనిని దృష్టిలో పెట్టుకొని నూతన కార్మికులు క్రమం తప్పకుండా విధులకు హాజరై అధిక బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జిఎం విజయ్ ప్రసాద్, ఏఐటీయూసీ ఏరియ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సిఎంఓఏఐ అధ్యక్షులు రవి, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డివైపిఎం సత్యబోస్, రాయలింగు (ఒఎస్), ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 17న క్రికెట్ ఎంపిక పోటీలు

**నిర్మల్ జనవరి 16, సూర్య మేజర్ న్యూస్**

తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్మల్ జిల్లా కేంద్రంలో అండర్ 14 క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ కోచ్ రామరాజు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ



ఎంపిక పోటీలకు వచ్చే వారి వయసు 14 ఏళ్ల లోపు ఉండాలి, ఆధార్ కార్డ్, వైట్ జెర్సీ తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఈ పోటీలు జిల్లా కేంద్రంలోని గండి రామన్న సాయిబాబా ఆలయం సమీపంలో ఉదయం 9 గంటలకు జరుగుతాయని తెలిపారు.

## గ్రామస్థాయిలో కబడ్డీ పోటీలు

**కడెం,జనవరి 17, సూర్య మేజర్ న్యూస్ :**

కడం మండలం కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఊరే జలజ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కడం



మండలంలోని లింగాపూర్ గ్రామంలో బుదవారం రోజున యువతకు కబడ్డీ పోటీలు నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ఖానాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు కడం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ పాల్గొనీ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడలు శారీరక వ్యాయామంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతో అవసరమని అన్నారు. గ్రామస్థాయిలో పండగ సందర్భంగా ఇలాంటి క్రీడల నిర్వహించి యువతను ప్రోత్సహించినందుకు ఊరే జలజకి అభినందనలు తెలియజేశారు. కబడ్డీలో గెలుపొందిన విజేతలకు ఊరే జలజ ప్రైజ్ మనీని అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి , ముష్కు రాజు, గంగమల్లు , రాజు , తిరుపతి రాజేందర్ , లక్ష్మణ్ ఆంటోనీ, వాహిద్ , డిజె శ్రీను, లక్కవత్తుల నారాయణ , మరియు గ్రామ నాయకులు యువత, మహిళలు , తదితరులు పాల్గొన్నారు.

## నాను మహారాజ్ జాతర ఉత్సవాల్లో పాల్గొన్న బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**సారంగాపూర్ ,జనవరి 16,సూర్య మేజర్ న్యూస్**

సారంగాపూర్ మండలం బండరేవు తండాలో ప్రసిద్ధ ఘంచిన నాను మహారాజ్ జాతర ఉత్సవాల్లో ఎమ్మెల్యే బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొని గిరిజన సోదరుల ఆరాధ్య దైవం నాను మహారాజ్ ఆలయాన్ని దర్శించుకోని అనంతరం జాతర ఉత్సవాల్లో పాల్గొనడం అనందగా ఉందన్నారు. రాబోవు రోజుల్లో ప్రతీ గిరిజన



మూరుముల గ్రామానికి కనీస సౌకర్యాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాను మహారాజ్ జాతర ఉత్సవాల్లో భాగంగా పలు క్రాడా కార్యక్రమాలు నిర్వహించారు. పోటీలో గెలిచిన క్రీడా కారులకు అభినందనలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కరిపే విలాస్, రాం శంకర్ రెడ్డి, పద్మ వీరయ్య, మోహన్ కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో అధికారుల సర్వే

**బెజ్జూర్,జనవరి 16,సూర్య మేజర్ న్యూస్:**

బెజ్జూర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని ఏటిగూడ గ్రామంలో రైతు భరోసా,నూతన రేషన్ కార్డుల వివరాల కోసం అధికారులు బుధవారం సర్వే చేపట్టారు. తహశీల్దార్ భుమేశ్వర్, ఏవో నాగరాజు,ఎంపీడీవో గౌరీ శంకర్ జాబితాలో పేర్లు వచ్చిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా సర్వేకు ప్రజలు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి తుకారం,సిబ్బంది పాల్గొన్నారు.



ఖానాపూర్ ప్రీమియం లీగ్ సీజన్ 3 విజేత

# పవర్ పాంథర్స్

**ఖానాపూర్ సూర్య మేజర్ న్యూస్ :**
ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 11వ తేదీ నుండి జరుగుతున్నటువంటి ఖానాపూర్ ప్రీమియం లీగ్ సీజన్ 3 క్రికెట్ టోర్నమెంట్ లో గెలుపొందిన విజేతగ పవర్ పాంథర్స్ నిలిచింది. క్రీడాకారులను ఉద్దేశించి మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా ఖానాపూర్ పట్టణ యువతలో దాగి ఉన్న క్రీడాస్ఫూర్తిని బయటకు తేవడానికి ప్రతి సంవత్సరం ఖానాపూర్ ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ను నిర్వహిస్తున్నారని అన్నారు. సెలవులలో క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల యువత గంజాయి మరియు చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉంటారని అన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ ను ఐపీఎల్ క్రికెట్ లాగా కేపీఎల్ టోర్నమెంట్ ను నిర్వహించారని అన్నారు. ఖానాపూర్ ప్రీమియం లీగ్ సీజన్3ని నిర్వహించిన మేనేజ్మెంట్ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈ క్రీడా పోటీల్లో పవర్ పాంథర్స్ మొదటి విజేతగా,రన్నర్‌గా చిరుత టీంలు నిలిచాయి.గెలుపొందిన వారికి ప్రైజ్ మనీని అందజేశారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కావలి సంతోష్,కౌన్సిలర్ నాయకులు సురేష్,నాయకులు మహేందర్,అడ్వకేట్ మట్టేరి రాజశేఖర్,తోటసుమిత్,డాక్టర్ కిరణ్‌కుమార్,సలీం ఖాన్,శరత్,ప్రకాష్ గౌడ్, క్రీడాకారులు,యువకులు నాయకులు మేనేజ్మెంట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## బిజెపి పార్టీ మండల అధ్యక్షులుగా సారా రమేష్ గౌడ్

**తిర్యాని జనవరి 16 సూర్య మేజర్ న్యూస్**
కిరియని మండల బిజెపి పార్టీ అధ్యక్షులుగా సార్ రమేష్ గౌడ్‌ను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి గురువారం రోజున జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా నాయకులు శ్రీశైలం నియామక పత్రాన్ని సారా రమేష్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం ఆరు విషయాలు కష్టపడి కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ తిర్యాని మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## చికిత్స పొందుతూ కడెం మండల వాసి మృతి

**కడెం,సూర్య మేజర్ న్యూస్ :**
కడెం మండలంలోని మొర్రిగూడెం గ్రామానికి చెందిన సాదు రాజేందర్ మద్యానికి బానిసై ఇంట్లో ఏమి పనిచేయకుండా వుండటంతో, పని చేయకుంటే మనం ఎలా బ్రతికేది, మందు తాగడం మనేయి అని భార్య అనడటంతో , మనస్తాపానికి గురి అయిన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు ఖానాపూర్ హాస్పిటల్ తీసుకువచ్చి, అటు నుండి మెరుగైన వైద్యం నిమిత్తం నిర్మల్ లోని రమేష్ రెడ్డి హాస్పిటల్ కు తీసుకెళ్ళి చికిత్సలు అందిస్తుండగా బుధవారం రాత్రి చికిత్స పొందుతూ మరణించినట్లు మృతిని భార్య అనుష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడెం ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి.

**నిర్మల్ జనవరి 16, సూర్య మేజర్ న్యూస్**
పసుపు బోర్డు ఏర్పాటుపై సంబరాలు చేసుకున్న బీజేపీ నాయకులు, రైతులు.నిజామాబాద్ జిల్లా కేంద్రంగా కేంద్రీయ పసుపు బోర్డు ఏర్పాటుపై బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని కొనియాడారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. ఈ బోర్డు ఏర్పాటుతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, రైతులు ఇకపై ఈ బోర్డును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బోర్డు ఏర్పాటులో రైతుల కృషితో పాటు ఎంపీ ధర్మపురి అరవింద్ కృషి కూడా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మ రాజు, తక్కల రమణ రెడ్డి, ముత్యం రెడ్డి, మండల అధ్యక్షులు మార గంగా రెడ్డి, వెంకట్ రెడ్డి, నాయకులు వీరేశ్, విలాస్, పోతన్న, వొడిసెల అర్జున్,అర్జున్, సాహెబ్ రావ్, శ్రవణ్, రాజేశ్వర్ రెడ్డి, చంద్రకాంత్, తిరుమల చారి, దినేష్, విజయ్, కార్తీక్, సుంకరి సాయి, కొండాజీ శ్రావణ్, ఎల్లయ్య, లక్ష్మా రెడ్డి, తో పాటు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుల జాబితా రూపకల్పనకై

# పకడ్బందీగా క్షేత్రస్థాయి పరిశీలన

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**







**నిర్మల్ జనవరి 16, సూర్య మేజర్ న్యూస్**
రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుండి అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి గ్రామ, వార్డు సభల ద్వారా అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ లతో కలిసి ఆమె వివిధ శాఖల అధికారులతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల అందేలా సమగ్ర లబ్దిదారుల జాబితాను తయారు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుంచి అమలు చేయనున్న పథకాలకు సంబంధించి అర్హులైన లబ్ధిదారుల ఎంపికను ఈనెల 19వ తేదీలోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి అర్హులను గుర్తించాలని తెలిపారు. నూతన రేషన్ కార్డుల జారీకి కుటుంబ ఆదాయం, భూములు వంటి విషయాలను ప్రమాణికంగా తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు వివిధ పథకాలకు సంబందించి అధికారులు గుర్తించిన లబ్దిదారుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజాపాలనలో వివిధ పథకాలకై ధరఖాస్తు చేసుకున్న వారి వివరాలను గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో వార్డు ఆఫీసర్లు దరఖాస్తుదారుల వివరాలు పరిశీలించి అర్హులను గుర్తించాలన్నారు. రైతు భరోసా పథకానికి సంబంధించి పంటను సాగు చేస్తున్న భూములను పారదర్శకంగా గుర్తించాలని తెలిపారు. సాగుకు యోగ్యం కానీ భూములు, గుట్టలు, వెంచర్లు, సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కాలువలు, రైల్వే లైన్, రహదారుల కోసం తీసుకున్న తదితర భూముల వివరాలు జాబితాలో ఉండరాదని, సాగుకు యోగ్యంగా ఉండే భూముల వివరాలతో జాబితా తయారు చేసి, క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా, ఆయా సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ది చేకూరేలా పూర్తి పారదృకత, నిబద్ధతతో క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటి వరకు సర్వే పూర్తికాని అర్హులందరూ ఎంపిడిఓ, మున్సిపల్ కార్యాలయాల్లో తమ వివరాలు తెలియజేయాలని, ఏవైనా సందేహాలు ఉంటే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ (6305646600)ను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో నిర్మల్, భైంసా ఆర్డీఓ లు రత్నకళ్యాణి, కోమల్ రెడ్డిలు, జెడ్పీ సిఈఓ గోవింద్, సిపిఓ జీవరత్నం, డిపిఓ శ్రీనివాస్, డిఆర్డీఓ విజయలక్ష్మి, వ్యవసాయాధికారి అంజిప్రసాద్, డిఎస్ఓ కిరణ్ కుమార్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రంలో పండ్ల పంపిణి

**మంచిర్యాల టౌన్, జనవరి 16,సూర్య మేజర్ న్యూస్ :**
మంచిర్యాల పట్టణంలోని జి.జి.హెచ్ ఆసుపత్రి ఆవరణలోని గురువారం రెడ్ క్రాస్ సొసైటీ రక్త నిధి కేంద్రంలో రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన కి.శే నూకల మోహన్ రావు 60 వ జన్మదినం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రంలో తలసేమియా,సికిల్ సెల్ పిల్లలకు,కుటుంబ సభ్యులు పండ్లు,స్వీటు, బిస్కెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నూకల నాగలక్ష్మి మాట్లాడుతూ మా భర్త 60 వ జన్మదిన వేడుకలను తల సేమియా పిల్లలతో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.ఇలాంటి కార్యక్రమం వలన వారి ఆత్మ శాంతి చేకూరుస్తుందని అన్నారు.పట్టణ ప్రజలు కూడా తమ జన్మదిన వేడుకలను కూడా రక్తనిధి కేంద్రాలలో రక్తదానం చేసి తల సేమియా వ్యాధిగ్రస్తులకు పండ్లను పంపిణీ చేసి వేడుకలను జరుపుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు నూకల నాగలక్ష్మి,నూకలవెంకటకృష్ణ,నూకలజగదీష్,క్యాంప్ ఆర్గనైజర్ ప్రేమ్‌కుమార్ సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

